20న రాష్ట్రస్థాయి చదరంగం పోటీలు

ప్రజాశక్తి- టెక్కలి

రాష్ట్రస్థాయి చదరంగం పోటీలు ఈ నెల 20న జిల్లా కేంద్రంలోని న్యూ సెంట్రల్ స్కూల్ ఆవరణలో నిర్వహిస్తామని చబడుతున్నాయని ఆల్ఇండియా సమాఖ్య చెస్ ఇన్స్కూల్స్ కమిటీ సభ్యులు సనపల భీమారావు ప్రకటనలో తెలిపారు. విద్యార్థులోని సృజనాత్మకతని వెలికి తీయడానికి ఈ పోటీలు ఉపయోగపడనున్నాయని అన్నారు. ఆరేళ్ల వయసు నుంచి 16 ఏళ్ల వయసు గలవారు అర్హులని అన్నారు. వివిధ కేటగిరిలో నిర్వహించే ఈ పోటీల్లో క్రీడాకారులకు రాష్ట్రస్థాయిలో వెయిటెజ్ ఇస్తామన్నారు. జాతీయస్థాయి పోటీల్లో పాల్గొనేందుకు ఇవి ఉపయోగపడతాయన్నారు. రాష్ట్రస్థాయి చదరంగం పోటీల్లో పాల్గొవాలనే క్రీడాకారులు రూ.500 ప్రవేశరుసుం చెల్లించి వెబ్సైట్లో తమ పేరుని నమోదు చేసుకోవాలని తెలిపారు.

స్మార్ట్ మీటర్లు వద్దు

- ట్రూ అప్ ఛార్జీలు రద్దు చేయాలి
- 5న విద్యుత్ సబ్స్టేషన్ల వద్ద ధర్నా
- రౌండ్‌టేబుల్ సమావేశంలో వామపక్ష నాయకులు

పోరాటానికి సంఘీభావం తెలుపుతున్న వామపక్ష నాయకులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

విద్యుత్ స్మార్ట్ మీటర్లు వద్దు అని, ట్రూ అప్ ఛార్జీలు రద్దు చేయాలని కోరుతూ ఆగస్టు 5న విద్యుత్ సబ్‌స్టేషన్ కార్యాలయాల వద్ద ధర్నా నిర్వహిస్తున్నట్లు సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, సిపిఐ జిల్లా కార్యదర్శి చాపర వెంకటరమణ, సిపి ఐఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి తాండ్ర ప్రకాష్ పిలుపునిచ్చారు. స్థానిక సుందరయ్య భవన్‌లో విద్యుత్ భారాలకు వ్యతిరేకంగా స్మార్ట్ మీటర్లు రద్దుపై రౌండ్‌టేబుల్ సమావేశం గురువారం నిర్వహించారు. సమావేశంలో వారు మాట్లాడుతూ ఎన్నికలకు ముందు స్మార్ట్ మీటర్లు బద్దలు కొట్టాలని యువగళం పాదయాత్రలో విద్యాశాఖమంత్రి లోకేష్ పిలుపు ఇచ్చారని గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చిన తరువాత అదానీ స్మార్ట్ మీటర్లు బిగించడం మోసం కాదా? అని ప్రశ్నించారు. స్మార్ట్ మీటర్ల ద్వారా ప్రజలను తీవ్రంగా దోపిడీ చేయడానికి పూనుకుంటున్నారని విమర్శించారు. టైం ఆఫ్ ది డే విధానం పేరుతో గంట గంటకు రీడింగ్ తీయవచ్చు అని, పగలు ఒక రేటు, రాత్రి ఒక రేటు చలికాలం ఒక రేటు వేసవికాలం ఒకరేటు, సాయంత్రం 6 నుంచి 10 గంటల వరకు మరొక రేటు ఉంటుందని తెలిపారు. ఈ విధంగా ప్రజలను అదానీ కంపెనీ దోపిడీ చేస్తుందని విమర్శించారు. ఇప్పటికే పెరిగిన విద్యుత్ బిల్లులతో సామాన్య ప్రజలు గగ్గోలు పెడుతున్నారని, ఎన్నికలకు ముందు టిడిపి కూటమి కరెంట్ ఛార్జీలు పెంచబోమని బాదుడు ఆపుతామని అధికారంలోకి వచ్చిన టిడిపి కూటమి ప్రజలను మోసం చేసిందని విమర్శించారు. అదానీ స్మార్ట్ మీటర్లు ఖర్చులు నిమిత్తం రూ.17500 వాయిదా 93 నెలల్లో అదనపు ఛార్జీలు వసూలు చేస్తారని వారన్నారు.

ఇళ్లకు బిగించకుండా ప్రజలు వ్యతిరేకించాలని కోరారు. దక్షిణాదిలో కేరళ, బెంగాల్, తమిళనాడు కర్ణాటక ప్రభుత్వాలు స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించాయని అన్నారు. ఇక్కడ బిజెపి టిడిపి డబుల్ ఇంజిన్ సర్కారు స్మార్ట్ మీటర్లు పెడుతుందని విమర్శించారు. రాష్ట్రంలో రెండు కోట్ల మీటర్లు పెట్టి రూ.25 వేల కోట్లు భారం ప్రజలపై వేసి దోపిడీ చేయడానికి పూనుకున్నారని విమర్శించారు. స్మార్ట్ మీటర్‌కి వ్యతిరేకంగా ఉద్యమం ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. జూలై 18 నుంచి 22 వరకు పట్టణ, మండలం కేంద్రాల్లో సదస్సులను విజయవంతం చేయాలని నిర్ణయించారు. కార్యక్రమంలో ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గంగరాపు సింహాచలం, సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్.అమ్మన్నాయుడు, ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు పి.చంద్రరావు, పట్టణ పౌర సంక్షేమ సంఘం కన్వీనర్ ఎమ్.గోవర్ధనరావు తదితరులు పాల్గొన్నారు.

బలవంతపు భూసేకరణకు వ్యతిరేకంగా పోరాటం

ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి మోహనరావు

మాట్లాడుతున్న మోహనరావు

ప్రజాశక్తి- పలాస

ఏరో స్పేస్ పార్కు భూసేకరణకు వ్యతిరేకంగా పోరాడి విజయం సాధించిన కర్ణాటక రైతాంగ పోరాట స్ఫూర్తితో కార్గో ఎయిర్‌పోర్టు బలవంతపు భూసేకరణకు వ్యతిరేకంగా పోరాడాలని ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.మోహనరావు, జీడి రైతు సంఘం జిల్లా కన్వీనర్ తెప్పల అజయ్‌కుమార్ పిలుపునిచ్చారు. కాశీబుగ్గ సిఐటియు కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఉద్దానం తీర ప్రాంతంలో రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్ ఫీల్డ్ కార్గో ఎయిర్‌పోర్టు పేరుతో బలవంతపు భూసేకరణకు పూను కొంటుందని, చట్ట వ్యతిరేకంగా రైతుల అభిప్రాయం తెలుసుకోకుండా వారి భూములను సర్వే చేయడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని అన్నారు. పచ్చని ఉద్దానం విధ్వంసానికి రాష్ట్ర ప్రభుత్వం పూనుకుంటుందని, ప్రజల ప్రయోజనాలకి భిన్నంగా ప్రభుత్వం ఏకపక్ష నిర్ణయాలు విచారకరమని అన్నారు. ఎవరు ఎన్ని ఆందోళనలు, ధర్నాలు చేసిన ఎయిర్‌పోర్టు నిర్మాణం ఆగదని స్థానిక ఎమ్మెల్యే ప్రకటన రైతులని రెచ్చగొట్టే విధంగా ఉందన్నారు. రైతుల వ్యతిరేకతని, వారి అభిప్రాయాలని పరిగణలోకి తీసుకోవడం శ్రేయస్కరమన్నారు. ఉద్దాన తీర ప్రాంతంలో పచ్చని జీడి, కొబ్బరి, పనస, మునగ చెట్లు వారి జీవనోపాధికే కాకుండా పర్యావరణానికి ఎంతో మేలు చేస్తాయని అన్నారు. అలాంటి భూములు కార్గో ఎయిర్‌పోర్టు కోసం సేకరించి అదే అభివృద్ధి అని చెప్పడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. ఉద్దానం ప్రాంతంలో కార్గో ఎయిర్‌పోర్టు పేరుతో సుమారు 1200 ఎకరాల భూమిని ప్రభుత్వం సేకరించి కార్పొరేట్ కంపెనీలకు అప్పచెప్పుతుందన్నారు. అక్కడ ఏర్పాటు నిర్మిస్తే ఏ విధమైన అభివృద్ధి జరుగుతుందో ప్రభుత్వం చెప్పాలని డిమాండ్ చేశారు. అభివృద్ధి అంటే రైతుల భూములు బలవంతంగా లాక్కొని కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టడం కాదని అన్నారు. ప్రజల జీవనోపాధిని దెబ్బతీసే అభివృద్ధిని అవసరం లేదని అన్నారు. రైతులు ఎనిమిది నెలలుగా పోరాడుతున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం చోచనీయమన్నారు. అభివృద్ధి అంటే ఈ ప్రాంతంలో రైతులు పండించిన పంటలకు మద్దతు ధరలు ప్రకటించి ప్రభుత్వమే కొనుగోలు చేయాలన్నారు. వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు నిర్మించి యువతకు ఉద్యోగాలు కల్పించాలన్నారు. భూములకు సాగునీరు అందించాలన్నారు. ఈ ప్రాంతంలో ప్రజల ఆస్తులకు రక్షణ లేకుండా చేస్తే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. కర్ణాటక ఏరో స్పేస్ పార్కు రైతుల పోరాట స్ఫూర్తిగా పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని ప్రభుత్వానికి హెచ్చరించారు. ఇప్పటికైనా ప్రభుత్వం కార్గో ఎయిర్‌పోర్టు నిర్మాణ ప్రతిపాదనలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. రైతు వ్యతిరేక విధానాలకు నిరసనగా పోరాడాలని పిలుపునిచ్చారు. సమావేశంలో రైతు సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు కె.బాలాజీరావు, తమ్మినాన భాస్కరరావు, సిఐటియు జిల్లా కార్యదర్శి ఎం.గణపతి పాల్గొన్నారు.

ప్లాస్టిక్ రహిత జిల్లాయే లక్ష్యం

కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, అధికారులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

'స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర'లో భాగంగా జూలై 19న జిల్లావ్యాప్తంగా ప్లాస్టిక్ కాలుష్య నిర్మూలనపై భారీగా ప్రచార, చైతన్య కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. ప్రతి గ్రామం, వార్డు, మండల స్థాయిలో ప్రజల భాగస్వామ్యంతో అవగాహనా కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ రాష్ట్రంలోని కలెక్టర్లతో గురువారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ అధికారులకు ఈ సూచనలు చేశారు. సచివాలయం నుంచి ప్రధాన కార్యదర్శితో నిర్వహించిన ఈ సమీక్షలో స్వర్ణాంధ్రపీ-4 ఫౌండేషన్, సానుకూల ప్రజా దృక్పథం, ఎంఎస్ఎస్ఇ పార్కులు, 'ప్రధానమంత్రి ఆదర్శ గ్రామ యోజన' వంటి అంశాలపై చర్చించారు. ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే నష్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించడానికి మున్సిపల్ కమిషనర్లు, ఎంపిడిఒలు తమ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలను సందర్శించాలని ఆదేశించారు. పేద కుటుంబాల దత్తత కార్యక్రమాన్ని వేగవంతం చేయడానికి మార్గదర్శులను వెంటనే గుర్తించి రిజిస్టర్ చేయాలని స్పష్టం చేశారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, అసిస్టెంట్ కలెక్టర్ దొనక పృథ్వీరాజ్ కుమార్, జిల్లా రెవెన్యూ అధికారి వెంకటేశ్వరరావు, పలు శాఖలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కృష్ణదాస్

మోసం చేయడం చంద్రబాబుకు కొత్తకాదు

వైసిపి జిల్లా అధ్యక్షులు కృష్ణదాస్

ప్రజాశక్తి- పోలాకి

సిఎం చంద్రబాబు నాయుడు ప్రజలకు ఇప్పుడేమీ కొత్తగా మోసం చేయడం లేదని... ఆయన ముఖ్యమంత్రి అయిన ప్రతిసారీ ప్రజలను మోసం చేస్తూనే ఉన్నారని వైసిపి జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్ అన్నారు. మండలంలోని సుసరాం, బి.జె.నాయుడు ఫంక్షన్ హాలో గురువారం బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మాట్లాడారు. పిల్లని ఇచ్చిన ఎన్‌టిఆర్‌నే వెన్నుపోటు పొడిచిన చంద్రబాబు... ఆయనకు అధికారం ఇచ్చిన ప్రతిసారీ ప్రజలకు వెన్నుపోటు పొడుస్తూనే ఉన్నారని దుయ్యబట్టారు. ప్రజలకు మోసం చేయడం ఆయనకు పరిపాటిగా మారిందన్నారు. సుపరిపాలన అంటూ డప్పు కొట్టుకుంటున్న కూటమి ప్రభుత్వం.. ఏడాది పాలనంతా అరాచకం, అప్పులు, అక్రమ కేసులు, అకృత్యాలు, అత్యాచారాలతోనే నడుస్తుందని విమర్శించారు. చంద్రబాబు మరోసారి ప్రజల్లో మోసగించారని విషయం ప్రజలు ఇప్పుడిప్పుడే నమ్ముతున్నారని అన్నారు. ప్రతిపక్షంలో ఉన్న జగన్ పర్యటనలకు వేలాదిగా వస్తున్న జనమే అందుకు నిదర్శనమని చెప్పుకొచ్చారు. కూటమి ప్రభుత్వంలో ఏడాదికే జగన్ భయం మొదలైందని.. ప్రజలకు తాము నమ్మించి మోసం చేశామని విషయం అందరికీ అర్థమైందని కూటమి నేతల్లో భయం మొదలైంది అన్నారు. వచ్చేది వైసిపి ప్రభుత్వమే అని భరోసా కల్పించారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి డాక్టర్ ధర్మాన కృష్ణచైతన్య, డిసిసిబి మాజీ చైర్మన్ కరిమి రాజేశ్వరరావు, ఎంపిపి ముద్దాడ భైరాగినాయుడు, వైసిపి మండల అధ్యక్షులు కణితి కృష్ణారావు, సర్పంచ్ దుంపల ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ పరీక్షలు నేరం

ఆర్‌డిఒ సాయిప్రత్యూష

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరమని, ఈ నిబంధనలను అతిక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆర్‌డిఒ సాయిప్రత్యూష హెచ్చరించారు. ఆర్‌డిఒ కార్యాలయంలో సబ్-డిస్ట్రిక్ట్ లెవెల్ అప్రోప్రియేట్ అథారిటీ, కమిటీ సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రసూతి ఆస్పత్రులు, స్కానింగ్ సెంటర్లు లింగ నిర్ధారణ నిబంధనలను కచ్చితంగా పాటించాలన్నారు. చట్టాన్ని ఉల్లంఘిస్తే కఠిన శిక్ష తప్పదని హెచ్చరించారు. శ్రీకాకుళం సబ్ డివిజన్ పరిధిలో లింగ నిర్ధారణ నేరంపై హోర్డింగ్‌లు ఏర్పాటు చేయాలని సూచించారు. గ్రామస్థాయిలో ప్రజల్లో అవగాహన కల్పించే సదస్సులు నిర్వహించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో గైనకాలజిస్టు పైడి స్వర్ణలత, డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ మేరీ కాథరిన్, డిప్యూటీ మాస్మీడియా అధికారి మహంతి వెంకటేశ్వరరావు, సిపి రమణమూర్తి, అడ్వకేట్ విజయలక్ష్మి, సోషల్ వర్కర్ లిడియా, మంతెన వెంకటస్వామి, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ విజయలక్ష్మి, పి.మోహిని పాల్గొన్నారు.

పరిశీలిస్తున్న కేంద్ర బృందం సభ్యులు

స్వచ్ఛ సర్వేక్షణ బృందం సర్వే

పొందూరు: స్థానిక మేజర్ పంచాయతీలో కేంద్ర ప్రభుత్వ నిధులతో చేపడుతున్న పారిశుధ్య నిర్వాహణ పనులను గురువారం కేంద్ర స్వచ్ఛ సర్వేక్షణ గ్రామీణ సర్వే బృందం పరిశీలించారు. కేంద్ర ప్రభుత్వం పంచాయతీలకు అందజేస్తున్న సాధారణ నిధులను పారిశుధ్య పనులకు ఏ విధంగా వినియోగిస్తున్నదీ బృందం సభ్యులు పరిశీలించారు. ఈ సందర్భంగా పట్టణంలోని ఒకటో నెంబర్ ప్రాథమిక పాఠశాల, ప్రభుత్వ కార్యాలయాలు, అంగన్వాడీలు, సామాజిక ప్రభుత్వ ఆస్పత్రితో పాటు పలు వీధుల్లో పారిశుధ్యాన్ని పరిశీలించి నమోదు చేశారు. పంచాయతీ పరిధిలో చేపట్టిన పారిశుధ్యంపై నివేదికను తయారు చేసి ఉన్నతాధికారులకు సమర్పించనున్నారు. ఈ పనులను కేంద్ర స్వచ్ఛ సర్వేక్షణ గ్రామీణ సర్వే విభాగం రీసెర్చ్ అసిస్టెంట్ ఎ.పుణ్యశ్రీ, ఆర్‌డబ్ల్యుఎస్ అధికారి ఎం.సంతోష్ కుమార్, డిపిఆర్‌సి సత్యనారాయణ, ఎఇఒ మోహన్‌బాబు, చోళ్ల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కిడ్నీ వ్యాధిపై పరిశోధన ప్రారంభిస్తాం

నార్త్ అమెరికా కెర్రిలింగ్ యూనివర్సిటీ ప్రొఫెసర్ ప్రవీణ్ కుమార్‌రాయ్

రోగులతో మాట్లాడుతున్న ప్రవీణ్ కుమార్‌రాయ్

ప్రజాశక్తి- పలాస

జిల్లాలోని ఉద్దానం ప్రాంతంలో ఎక్కువుగా కిడ్నీ వ్యాధులతో బాధపడుతున్నారని, కిడ్నీ వ్యాధిపై తమ బృందం పరిశోధన ప్రారంభిస్తామని నార్త్ అమెరికా కెర్రిలింగ్ యూనివర్సిటీ ప్రొఫెసర్ ప్రవీణ్ కుమార్ రాయ్ అన్నారు. మండలంలోని గొల్లమాకన్నపల్లి, మాకన్నపల్లి గ్రామాల్లో గురువారం బృందం పర్యటించి కిడ్నీ రోగులతో మాట్లాడారు. అనంతరం విశాఖపట్నం కెజిహెచ్ ఆస్పత్రి నెఫ్రాలజిస్టు డాక్టర్ రవిరాజ్, ఎమ్మెల్యే గౌతు శిరీషతో కలిసి కాశీబుగ్గ కిడ్నీ ఆస్పత్రిని సందర్శించారు. కిడ్నీ రోగులను పరిశీలించారు. వ్యాధి వివరాలు గత ఎన్ని సంవత్సరాల నుంచి ఎన్ని గ్రామాల్లో ఈ వ్యాధి విస్తరించి ఉంది. వ్యాధి సమయంలో రోగులు పడుతున్న బాధలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ ఉద్దాన ప్రాంతంతో ఈ వ్యాధి తీవ్రత ఎక్కువగా ఉందని, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, పలువురు నెఫ్రాలజిస్టులు తమ దృష్టికి తీసుకొచ్చారని అన్నారు. ఈ వ్యాధి చాలా ప్రమాదకరమైనదన్నారు. ముందుగా ఈ ప్రాంతంలోనే ఎక్కువుగా ఈ వ్యాధి రావడానికి కారణాలు కనుగొలగలిగితే సమస్యను సులువుగా పరిష్కరించగలమని పేర్కొన్నారు. త్వరలో తమ పరిశోధన బృందంతో కలిసి ప్రారంభిస్తామన్నారు. డాక్టర్ రవిరాజ్ మాట్లాడుతూ ఈ ప్రాంతంలోని కిడ్నీ వ్యాధికి గల కారణాలు కనుగొనడం కష్టతరంగా మారిందన్నారు. అయితే తాగునీరు కూడా ఒక కారణం కావచ్చని అన్నారు. ఎన్‌టిఆర్ సుజల స్రవంతి ద్వారా ప్రభుత్వం శుద్ధ జలాలను అందిస్తుందని అన్నారు. అలాగే డయాలసిస్ కేంద్రాలనూ ఏర్పాటు చేశారని అన్నారు. ఎమ్మెల్యే శిరీష మాట్లాడుతూ వ్యాధి నివారణకు గత టిడిపి ప్రభుత్వంలో బీజం పడిందన్నారు. కార్యక్రమంలో కిడ్నీ ఆస్పత్రి సూపరింటెండెంట్ అల్లు పద్మజ, ఎపి ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ వజ్జ బాబూరావు, మల్లా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు రక్షణ కవచం 'శక్తి' యాప్

అవగాహన కల్పిస్తున్న శక్తి బృందం

శ్రీకాకుళం సిటీ: మహిళలకు రక్షణగా శక్తి మొబైల్ యాప్ ఉపయోగపడుతుందని, ప్రతి ఒక్కరు మీ మొబైల్ ఫోన్లలో శక్తి యాప్‌ని నిక్షిప్తం చేసుకుని ఆపద, అత్యవసర సమయంలో సద్వినియోగం చేసుకోవాలని శక్తి టీం పోలీసు సిబ్బంది అన్నారు. ఎస్‌పి మహేశ్వర రెడ్డి ఆదేశాల మేరకు శ్రీకాకుళం, టెక్కలి, కాశీబుగ్గ పోలీసు సబ్ డివిజన్ పరిధిలో స్కూల్, కాలేజీలు, రైల్వే, బస్ స్టేషన్లు, పబ్లిక్ ప్రదేశాలు, షాపింగ్ మాల్‌లో మహిళలకు గురువారం శక్తి యాప్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శక్తి యాప్ మహిళలకు రక్షణ భద్రత ఉంటుందన్నారు. శక్తి యాప్ ద్వారా డయల్ 112, ఎస్ఒఎస్ బటన్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చునని అన్నారు. మహిళలకు ఆపద సమయంలో అత్యవసర సాయం అందించేందుకు శక్తి యాప్ ఒక ఆయుధంగా పనిచేస్తుందన్నారు.

నష్టపరిహారంపై మళ్లీ సర్వే చేయాలి

ఆర్‌డిఒను కోరిన మూలపేట నిర్వాసితులు

అభ్యంతరాలను తెలియజేస్తున్న నిరాసితులు

ప్రజాశక్తి- సంతబొమ్మాళి

తమ ఇంటి నిర్మాణాలకు గతంలో వేసిన నష్టపరిహారం అంచనాలను కాకుండా మళ్లీ ఇంజినీరింగ్ అధికారులతో రీ సర్వే చేయించాలని మూలపేట నిర్వాసితులు డిమాండ్ చేశారు. మండలంలోని మూలపేట పోర్టు నిర్వాసితుల నుంచి పరిహారం చెల్లింపుపై టెక్కలి ఆర్‌డిఒ ఎం.కృష్ణమూర్తి ఆధ్వర్యాన అధికారులు గురువారం అభ్యంతరాలు స్వీకరించారు. ఈ నెల 8న గ్రామంలో నిర్వాసితులతో సమావేశం ఏర్పాటు చేసిన ఆర్‌డిఒ పది రోజుల్లో అభ్యంతరాలు స్వీకరించి అర్హులకు పరిహారం అందాల చూస్తానని హామీ ఇచ్చారు. ఈ మేరకు నాలుగు సచివాలయాల నుంచి ఎంపిక చేసిన 30 మంది సిబ్బంది, రెవెన్యూ, సర్వే అధికారులు ఇంటింటికీ వెళ్లి అభ్యంతరాలను స్వీకరించారు. దీంలో నిర్వాసితులు పలు అభ్యంతరాలను వ్యక్తం చేశారు. తమకు జీడి, మామిడి తోటలకు సుమారు 45 ఎకరాల వరకు పరిహారం అందలేదని కొందరు చెప్పారు. సుమారు 40 ఎకరాలు వరకు పలు కారణాలతో పరిహారం పడలేదని నిర్వాసితులు ఆర్‌డిఒ దృష్టికి తీసుకెళ్లారు. పశువుల శాలలు, కొబ్బరి మొక్కలకు పరిహారం అందలేదని, అలాగే ఇంటి పెరట్లో స్థలాన్ని లెక్క కట్టలేదని సర్పంచ్ బాబూరావు అభ్యంతరాలను అధికారులకు దృష్టికి తీసుకొచ్చారు. తమ ఇంటి నిర్మాణాలకు రెండేళ్ల కిందట వేసిన అంచనాలకు ఇప్పుడు ధరలు సరిపోవని ప్రస్తుత ధరలు ప్రకారం మళ్లీ ఇంటి నిర్మాణాల అంచనాలు వేయాలని మాజీ సర్పంచ్ జీరు భీమారావు కోరారు. గ్రామంలో 348 ఇళ్లు ఉంటే దాదాపు అందరూ మళ్లీ నష్టపరిహార అంచనా వేయాలని కోరారు. పూర్తిస్థాయిలో అర్హులందరికీ నష్టపరహారం చెల్లించాక తమ గ్రామాన్ని తీసుకోవాలని చెప్పారు. నిర్వాసితుల చెప్పిన అభ్యంతరాలను సిబ్బంది నమోదు చేసుకున్నారు. స్వీకరించిన అభ్యంతరాలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి సమస్య పరిష్కరిస్తానని ఆర్‌డిఒ హామీ ఇచ్చారు. ఈ సర్వే కార్యక్రమంలో తహశీల్దార్ హేంసుందర్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల ధర్నా

శ్రీకాకుళం సిటీ : ధర్నా నిర్వహిస్తున్న కార్మికులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

మున్సిపల్ కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్.అమ్మనాయుడు, నగర కన్వీనర్ ఆర్.ప్రకాష్, ఎపి మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ నగర అధ్యక్షులు అరుగుల గణేష్ డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారానికి నిర్వహిస్తున్న సమ్మెలో భాగంగా మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్, సిఐటియు ఆధ్వర్యాన నగరపాలక కార్యాలయం వద్ద గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. దుమ్ము, ధూళి, దుర్గంధం భరిస్తూ పట్టణ పరిశుభ్రతకు పాటుపడుతున్న మున్సిపల్ కార్మికులపై కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాది పూర్తయినా మున్సిపల్ కార్మికులకు ఇచ్చిన హామీలు అమలు చేయలేదని అన్నారు. గత ప్రభుత్వం అంగీకరించిన ఒప్పందాలకు జిఒలను జారీ చేయాలన్నారు. ఆప్కాస్‌లోనే కొనసాగించాలన్నారు. తల్లికి వందనం వంటి ప్రభుత్వ సంక్షేమ పథకాలు మున్సిపల్ కాంట్రాక్టు కార్మికులకూ అమలు చేయాలన్నారు. ఉద్యోగ విరమణ వయోపరిమితి 62 ఏళ్లకు పెంచాలన్నారు. గ్రాట్యూటీ చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నాకు ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గంగరాపు సింహాచలం, పట్టణ పౌర సంక్షేమ సంఘం కన్వీనర్ ఎం.గోవర్ధనరావు, ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు పి.చంద్రరావు మద్దతు పలికారు. కార్యక్రమంలో ఎ.శంకర్, ఎ.మోహన్, డి.చిట్టిబాబు, ఆర్.యుగంధర్, ఎన్.పార్వతి, ఎ.లక్ష్మి, ఆర్.ఈశ్వరమ్మ, పి.మల్లమ్మ, కె.బాలరాజు పాల్గొన్నారు.

ఆమదాలవలస : ఆప్కాస్‌లోని మున్సిపల్ కార్మికులన రెగ్యులర్ చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. పట్టణంలోని మోణింగి వారి వీధిలో ఉన్న మస్టర్ పాయింట్ వద్ద కార్మికులు సమ్మె నిర్వహించారు. విధులకు హాజరు కాకుండా పట్టణంలోని లక్ష్మీ నగర్ వీధి కూడలి నుంచి వన్వే, జంక్షన్ వద్ద ఉన్న గాంధీ విగ్రహం వరకు నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ అధ్యక్షులు తాడి సంతోష్, ప్రధాన కార్యదర్శి నీలాపు.రాజేష్, కోశాధికారి జె.శ్రీనివాసరావు, నాయకులు కె.తారకేశ్వరరావు, కె.ధనలక్ష్మి ఎన్.రమ, కె.ఈశ్వరరావు కె.నీలమ్మ, ఎ.శ్రీనివాస్, డి.రాజేష్ పాల్గొన్నారు.

పలాస : పలాసలో నిర్వహించిన ర్యాలీలో సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్.గణపతి, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు కె.వెంకట్, సిహెచ్.మురగన్, ఎం.రవి, ఎస్.శంకర్, ప్రకాష్ ముఖి, ఎస్.రమేష్, కె.ఈశ్వరరావు, బాలకృష్ణ, తిరుపతి, దివాకర్ గులాబీ, పార్వతి, పాపమ్మ పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం: మున్సిపాల్ కార్మికులు చేపట్టిన సమ్మెలో ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులు ఎ.రమేష్‌కుమార్ పట్నాయక్, సిఐటియు జిల్లా కార్యదర్శి సంగారు లక్ష్మీనారాయన డి.లక్ష్మణరావు, డి.ఢిల్లీ, గంగాధర్, సత్తు పాల్గొన్నారు.

NAME CHANGING

My Self **BAIREDLA SURESH,** S/o BAIREDLA SESHAYYA, Gondyala puttuga, Kaviti Mandal /Post, Srikakulam (Dist), Andhrapradesh, 532322. I am working in the ARMY for the last 15 years and iam Currently serving as HAV. I hereby Inform you that I am changing my wife's Surname from **TADAKA JYOTHI to BAIREDLA JYOTHI** for the purpose of correcting my records and also my mother name is correcting from **BAIREDLA SUSELA to BAIREDLA SUSHEELA** and date of Birth as 14-9-1960 to 14-9-1961

యోగా పోటీల వివరాలు వెల్లడిస్తున్న ఎమ్మెల్యే శంకర్

3న జిల్లాస్థాయి యోగా పోటీలు

శ్రీకాకుళం సిటీ: నేషనల్ యోగా స్పోర్ట్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి యోగా పోటీలు ఆగస్టు 3న నరసన్నపేటలో నిర్వహించనున్నట్లు శ్రీకాకుళం నియోజకవర్గం ఎమ్మెల్యే, ఎన్‌వైఎస్‌ఎఫ్ అధ్యక్షుడు గొండు శంకర్ తెలిపారు. విశాఖ-ఎ కాలనీలో ఆయన క్యాంపు కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని, ప్రస్తుత కాలంలో యోగాను జీవితంలో ఒక భాగం చేసుకోవాలని సూచించారు. జిల్లాస్థాయిలో అన్ని కేటగిరీల్లో ఉన్న యోగా క్రీడాకారులు పోటీల్లో పాల్గొని పోటీలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఉదయం 7 గంటల నుంచి ఈ పోటీలు నిర్వహించ నున్నట్లు చెప్పారు. ఈ పోటీల్లో విజేతలు రాష్ట్రస్థాయి యోగాసన పోటీలకు పంపిస్తామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు కొంక్యాన మురళీధర్, యోగా శిక్షకులు అర్చన, కార్యదర్శి తంగి స్వాతి, కోశాధికారి చౌదరి శ్రీనివాస్, దుంపల చిన్నబాబు, రమ్య, జీవిత, పాండ్రంకి మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వాస్పత్రిలో తప్పిన ప్రమాదం

ప్రజాశక్తి- పొందూరు

పట్టణంలోని ప్రభుత్వ సామాజిక ప్రభుత్వ ఆస్పత్రిలో గురువారం భవనం పైకప్పు పెచ్చులూడి పడిన సంఘటనలో తృటిలో ప్రమాదం తప్పింది. ఒక్కసారిగా పెద్ద శబ్దంతో పెచ్చులూడి పడడంతో సమీపంలో ఉన్న రోగులు, సిబ్బంది భయాందోళనతో పరుగులు తీశారు. సంఘటన జరిగిన సమయంలో శ్లాబ్ కిందన ఎవరూ లేకపోవడంతో ఎవరికీ గాయాలు కాలేదు. దశాబ్దాలు నాటి ఆస్పత్రి భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరడంతో ఎప్పటికప్పుడు పెచ్చులూడి పడుతున్నాయని సిబ్బంది, రోగులు వాపోతున్నారు. బయట ప్రమాదాలు జరిగి చికిత్స కోసం ఆస్పత్రికి రావాల్సి ఉండగా, ఆస్పత్రికి వస్తేనే ప్రమాదాలు బారిన పడేటట్టు ఉన్నామంటూ రోగులు భయాందోళనలను వ్యక్తం చేస్తున్నారు. ఆస్పత్రి పక్కనే నూతనంగా భవనం నిర్మాణం దాదాపుగా పూర్తి అయినప్పటికీ బిల్లులు పెండింగ్‌లో ఉండడంతో పనులు పూర్తి చేయడంలో జాప్యం జరుగుతుంది. ఆస్పత్రి దుస్థితి ఇలా ఉన్నా ఉన్నతాధికారులు చర్యలు చేపట్టకపోవడంతో రోగులు మండిపడుతున్నారు.

ఆస్పత్రిలో ఊడిపడిన శ్లాబ్ పెచ్చులతో సిబ్బంది

అండర్ పాస్ బ్రిడ్జి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి- కవిటి

మండలంలో గొర్లపాడు అండర్ పాస్ రైల్వే బ్రిడ్జి మరమ్మతుల పనులకు గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా జెడ్‌ఆర్‌యుసిసి మెంబర్ శ్రీనివాసరావు రౌళో మాట్లాడుతూ ఇప్పటికే మంజూరైన నిధులతో వారం రోజుల్లో పనులు ప్రారంభించడం అభినందనీయమని అన్నారు. వర్షాకాలంలో ప్రజలు, వాహనదారులు ఈ మార్గంలో ఇబ్బందులు లేకుండా ప్రయాణించేందుకు వీలుగా పనులను త్వరితగతిన పూర్తిచేసేందుకు అధికారులు కృషి చేస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు మణిచంద్రప్రకాశ్, సదానందరావు, బాసుదేవరావు, బి.పీతాంబరి, బి.కృష్ణరావు, డి.త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

శంకుస్థాపన చేస్తున్న శ్రీనివాసరావు

లక్షల్లో వ్యయం...ఫలితం శూన్యం

- ఖరీఫ్‌కు అందని సాగునీరు
- ఆందోళనలో అన్నదాతలు

రైతులకు ఈ ఏడాది ఖరీఫ్‌కు సకాలంలో పూర్తిస్థాయిలో సాగునీరు అందించేందుకు అన్ని విధాలుగా చర్యలు తీసుకుంటామని ఎంతో దాంబికాలు పలికిన ప్రభుత్వం ఆదిశగా చర్యలు తీసుకున్న దాఖలాలు కనిపించడం లేదు. దీంతో రైతులకు అవస్థలు తప్పడం లేదు. ఈ ఏడాది కూడా పూర్తిస్థాయిలో సాగునీరు అందడం ప్రశ్నార్థకమేనని రైతులు వాపోతున్నారు.

నాగావళి నదిలో గండి పడిన దేశాయ్ ఛానల్

ప్రజాశక్తి- బూర్జ

పాలకొండ, బూర్జ మండలాల భూములకు సాగునీరు అందించే దేశాయ్ ఛానల్ నేడు చుక్కనీరు కూడా ఇవ్వని దుస్థితి నెలకొంది. పాలకొండ మండలం గోపాలపురం గ్రామ సమీపంలోని నాగావళి నది ద్వారా దేశాయ్ ఛానల్ నుంచి అన్నవరం, అంపిలి, బూర్జ మండలం డొంకల పర్త, వై.పర్త, కిలంతరి, పనుకుపర్త, అల్లెన, పాలవలస, తుడ్డలి, లక్కుపురం, కొండాపురం గ్రామాల్లో సుమారు 1786 ఎకరాలకు సాగునీరు అందించేది. మండలంలోని శివారు భూములకు సాగునీరు అందించేందుకు చర్యలు చేపట్టినట్లు అధికారులు చెబుతున్నారు.

అభివృద్ధికి రూ.45 లక్షల వ్యయం

ఈ ఏడాది అత్యధికంగా అటు ఇరిగేషన్ ఇటు ఎన్‌ఆర్‌ఇజిఎస్ సుమారు రూ.45 లక్షలతో దేశాయ్ ఛానల్ నిధులను ఖర్చు చేశారు. అయితే లక్షలాది రూపాయలు వ్యయం చేసినప్పటికీ ఫలితం మాత్రం శూన్యమని రైతులు బహిరంగానే విమర్శలు గుప్పిస్తున్నారు తూతూ మంత్రంగా పనులు చేపట్టడంతో ఈ ఏడాది కూడా సాగునీరు అందడం ప్రశ్నార్థకంగానే ఉందని రైతులు ఆరోపిస్తున్నారు. ఉపాధిహామీ పథకం ద్వారా రూ.41,27,978 వేతనాలుగా ఖర్చు చేయగా నీటిపారుదల శాఖ ఇదే ఛానల్ జంగిల్ క్లియరెన్స్‌కు రూ.4 లక్షల వ్యయంతో పనులు చేపట్టడం జరిగింది. ఐదు కిలోమీటర్ల జంగిల్ క్లియరెన్స్‌కు రూ.4లక్షల 527 వేలు ఖర్చు చేయడం విడ్డూరంగా ఉందని రైతులు విమర్శలు గుప్పిస్తున్నారు.

కొట్టుకుపోయిన అడ్డుకట్ట

ముఖ్యంగా నాగావళి నది నుంచి నీరు దేశాయ్ ఛానల్‌కు వెళ్లేదని, సుమారు 40 అడుగుల అడ్డుకట్ట కొట్టుకుపోవడంతో ఆరు సంవత్సరాల నుంచి నాగావళి నది నీరు దేశాయ్ ఛానల్‌కు రాకుండా బయటకు వెళ్లిపోతుందని రైతులు వాపోతున్నారు.

తప్పని అవస్థలు...

ఖరీఫ్ సీజన్ ప్రారంభమై నెలరోజులు కావస్తున్నప్పటికీ సకాలంలో సాగునీరు అందడం లేదని రైతులు వాపోతున్నారు. మండలంలోని అల్లెన, కిలంతిరి గ్రామాల్లో ఇప్పటికే ఉడుపులు ప్రారంభం అయినప్పటికీ ఈ కాలువ ద్వారా సాగునీరు అందక రైతులు దూర ప్రాంతాల్లో నుంచి ఇంజన్ల సాయంతో నీరు తెచ్చుకోవాల్సిన పరిస్థితులు తలెత్తుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది కూడా పూర్తి స్థాయిలో సాగునీరు అందడం ప్రశ్నార్థకమేనని రైతులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు, దేశాయ్ ఛానల్ నీటి సంఘం అధ్యక్షుడు బెజ్జిపురపు స్వామి నాయుడు దీనిపై దృష్టి సారించి పూర్తిస్థాయిలో పనులు చేపట్టి శివారు భూములకు సాగునీరు అందేలా చర్యలు చేపట్టాలని పాలకొండ, బూర్జ మండలాల రైతులు కోరుతున్నారు.

చుక్కనీరు లేని దేశాయ్‌ఛానల్ కాలువ

రైతులగోడు పట్టదా..?

గత ఐదేళ్లుగా దేశాయ్ ఛానల్ ద్వారా సాగునీరు అందడం లేదు. తూతూ మంత్రంగా జంగిల్ క్లియరెన్స్ చేసి అధి కారులు చేతులు దులుపు కుంటున్నారు. రైతుల గోడు అధికారులకు, ప్రజాప్రతి నిధులకు పట్టడం లేదు. ఇప్పటికైనా సకాలంలో సాగునీరు అందించేలా చర్యలు చేపట్టాలి.

మురపాక ఎరకయ్య, రైతు

ఇంజిన్ల సాయంతోనే సాగునీరు

ఉడుపులు ప్రారంభం అయినప్పటికీ సాగునీరు అందడం లేదు. ఇంజన్ల సాయంతో నీరు తెచ్చుకోవాల్సిన పరిస్థితి వుంది. నదిలో మేట్లు వేసిన ఇసుకను తొలిగేందుకు చర్యలు చేపట్టలేదు. శివారు భూములకు సాగునీరు అందించేందుకు అధికారులు చర్యలు చేపట్టాలి.

గేదెల జనార్ధన, రైతు

ఎఎంసి చైర్మన్ల నియామకం

జోత్స్న

రామకృష్ణారావు

శ్రీకాకుళం సిటీ : జిల్లాలోని శ్రీకాకుళం, హిరమండలం, పాతపట్నం మార్కెట్ కమిటీ చైర్మన్లను ప్రభుత్వం నియమిస్తూ గురువారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. శ్రీకాకుళం నియోజకవర్గం మార్కెట్ కమిటీ చైర్మన్‌గా దారపు జోత్స్నను నియమించారు. ఈమె జనసేన పార్టీలో కీలకంగా వ్యవహిస్తున్నారు. శ్రీకాకుళం లాంటి ప్రాధాన్యత ఉన్న నియోజకవర్గం జనసేన పార్టీకి కేటాయించారు. ఈమె నియామకంపై కూటమి నాయకులు అభినందనలు తెలిపారు. కంచిలి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా టిడిపికి చెందిన మద్దిలి విజయలక్ష్మిని ప్రభుత్వం నియమించింది. హిరమండలం మార్కెట్ కమిటీ చైర్మన్‌గా జనసేన పార్టీకి చెందిన మామిడి రామకృష్ణారావును వరించింది. పాతపట్నం మార్కెట్ కమిటీ చైర్మన్‌గా టిడిపికి చెందిన చిన్నింటి గౌరమ్మను నియమించింది.

అప్పుల బాధ తాళలేక వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి- పొందూరు

పొందూరు కచేరీవీధికి చెందిన చిరు వ్యాపారి ఎరిబోతు దుర్గారావు (28) బుధవారం సాయంత్రం తన ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బుధవారం సాయంత్రం ఇంట్లో ఎవరు లేని సమయంలో తలుపులు వేసుకుని ఫ్యాన్‌కు ఉరివేసుకున్నాడు. రాత్రి ఎనిమిది గంటల సమయంలో కుటుంబ సభ్యులకు అనుమానం వచ్చి తెరిచిచూడగా ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించాడు. వెంటనే స్థానిక సామాజిక ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాకుళం రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. గురువారం పోస్టుమార్టం అనంతరం అంత్యక్రియలు నిర్వహించారు. ఈయనకు భార్య లక్ష్మి, ఇద్దరు పిల్లలు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సచివాలయ ఉద్యోగిని అదృశ్యం

ప్రజాశక్తి- ఆమదాలవలస

మండలంలోని రామచంద్రాపురం గ్రామ సచివాలయంలో వైద్య విభాగ విధులు నిర్వహిస్తున్న సచివాలయ ఉద్యోగిని రావులవలస సుకన్య కనిపించకపోవడంతో కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. పోలీసులు అందించిన వివరాల ప్రకారం పట్టణంలోని వరదా వారి కోటర్స్‌లో నివాసం ఉంటున్న సుకన్య బుధవారం గ్రామ సచివాలయ విధులకు వెళ్లినట్లు తల్లి పార్వతి తెలిపింది. బుధవారం విధులకు వెళ్లిన తన కుమార్తె గురువారం ఉదయం వరకు ఇంటికి తిరిగి రాకపోవడంతో పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేసింది. తల్లి పార్వతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

సన్మానిస్తున్న సభ్యులు

కలెక్టర్‌కు సన్మానం

పలాస : పలాస జీడిపప్పుకు ప్రతిష్టాత్మక వన్ డిస్ట్రిక్ట్ వన్ ప్రొడక్ట్ అవార్డును కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండరీకర్ ఇటీవల అందున్నారు. ఈ మేరకు అల్ ఇండియా క్యాష్యూ అసోసియేషన్ ఎఐసిఎ, పారిశ్రామికవాడ జీడి వ్యాపారుల సంఘం సభ్యులు గురువారం కలెక్టరేట్‌లో కలెక్టర్‌ను సన్మానించారు. ఎఐసిఎ బోర్డు మెంబర్ మల్లా కాంతారావు, పారిశ్రామికవాడ అధ్యక్షులు మల్లా రామేశ్వరరావు, కార్యదర్శి తూముల శ్రీనివాసరావు, వినయ్, తాళాసు శ్రీను, సుడియా రత్నాకర్, కొంచాడ సందీప్ పాల్గొన్నారు.

సొంత డబ్బులతో కాలువ నిర్మాణం

ఇచ్ఛాపురం: మున్సిపాలిటీ పరిధిలోని బలరాంపేటలో డ్రైనేజ్‌పై కప్పు విరిగి రెండేళ్లు అవుతుంది. దీనిని పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. ఈ సమస్య వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. దీనిని చూసి చలించిన జిల్లా వైసిపి యువజన విభాగం ప్రధాన కార్యదర్శి కాళ్ల మదన్ తన సొంత డబ్బులు వెచ్చించి కాలువపై కప్పును గురువారం నిర్మించారు. చిన్న సమస్య కూడా పరిష్కరించని నేతలపై తీరుపై వార్డు ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. మొత్తం మీద స్పందించిన కాళ్ల మదన్ చొరవ తీసుకుని మరమ్మతులు చేపట్టడంతో పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కాలువపై కప్పు నిర్మిస్తున్న మదన్

సోంపేట : మాట్లాడుతున్న హరిబాబు

బాలసదన్ సందర్శన

ప్రజాశక్తి- సోంపేట

పట్టణంలోని ఇందిరమ్మ కాలనీ దగ్గరలో ఉన్న బాలసదన్‌ను జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.హరిబాబు గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర న్యాయ సేవా అధికార సంస్థ అమరావతి, అధ్యక్షులు జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. ఈ మేరకు ఆయన పిల్లలతో మాట్లాడుతూ వారి ఆహార, చదువుపై అడిగి తెలుసుకున్నారు. వంట, పిల్లలు నిద్రించే ప్రదేశాలను, తాగునీటి సౌకర్యాలను పరిశీలించారు. అనంతరం పిల్లలతో మాట్లాడుతూ వారికి ఏమైనా సమస్యలు ఉన్నాయా? లేవా? అని తెలుసుకున్నారు. బాగా చదువుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పలాస : కాశీబుగ్గ బాలసదన్‌ను జిల్లా న్యాయసేవా అధికార సంస్థ కార్యదర్శి, జిల్లా సీనియర్ సివిల్ జడ్జి కె.హరిబాబు సందర్శించారు. బాలికల వసతి పరిశీలిస్తూ, వారికి అందించే భోజనం ఇతర సౌకర్యాలు కోసం విద్యార్థులకు అడిగి తెలుసుకున్నారు.

అనధికార ఎరువులు విక్రయిస్తే చర్యలు

రణస్థలం రూరల్: అనధికార ఎరువుల అమ్మకాలు చేసినా, నిల్వలు చేసినా చర్యలు తప్పవని సహాయ వ్యవసాయ సంచాలకులు బి.విజయప్రసాద్ అన్నారు. గురువారం వ్యవసాయ శాఖ అధికారులు, విజిలెన్స్ అధికారులు మండలంలోని కోష్ట జంక్షన్‌లో ఉన్న శ్రీ శ్రీనివాస ఎంటర్‌ప్రైజెస్ రిటైల్ ఎరువుల షాపు లైసెన్స్‌ను తనిఖీ చేయగా అందులో ఎరువుల అదనపు గోడౌన్ లైసెన్స్‌లో పొందుపరచలేదని పరిశీలించి గుర్తించారు. గోడౌన్‌లో ఉన్న సుమారు 126 మెట్రిక్ టన్నుల ఎరువుల అమ్మకాన్ని నిలుపుదల చేస్తూ ఉత్తర్వులు జారిచేశారు. వాటికి సంబంధించిన పత్రాలు, జిఎస్‌టి బిల్ పొందుపర్చే వరకు అమ్మకాలు జరపరాదని ఆదేశించారు. తనిఖీల్లో సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ విజిలెన్స్ డిపార్ట్‌మెంట్ అడారి సంతోష్ కుమార్, మండల ఎఒ డి.విజయ భాస్కర్, డిఎఒ ఆఫీస్ వ్యవసాయ అధికారి సురేష్ పాల్గొన్నారు.

ఆమదాలవలస : పట్టణంలోని ఎరువుల షాపులపై వ్యవసాయ శాఖ, విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహించారు. పట్టణంలోని హోల్‌సేల్ ఫెర్టిలైజర్స్ డీలర్స్ వైశ్యరాజు శ్రీరామరాజు అండ్ కో కెసిఆర్ గోడౌన్స్‌పై దాడి చేసి విస్తృతంగా తనిఖీలు చేసి దస్త్రాలను పరిశీలించారు. శ్రీరామరాజు అండ్ కో సంబంధించిన శ్రీదేవి టాకీస్ వద్ద నున్న ఎరువుల గోడౌన్‌ను తనిఖీ చేసి దస్త్రాలకు అక్కడ ఉన్న సరుకుకు తేడాను పరిశీలించారు. దస్త్రాల్లో ఉన్న సమాచారానికి సరుకు సరిపోలడంతో అక్కడి నుంచి వెనుదిరిగారు. బిఆర్ నగర్ వద్దనున్న కెసిఆర్ గోడౌన్‌లో తనిఖీలు నిర్వహించారు. అక్కడ ఎటువంటి తేడాలు లేనట్లు గుర్తించారు.

రణస్థలం రూరల్ : రికార్డులు పరిశీలిస్తున్న అధికారులు

గంజాయిని స్వాధీనం చేసుకున్న పోలీసులు

గంజాయితో ఇద్దరు అరెస్టు

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ మురళీధర్ ఆధ్వర్యాన సోంపేట ఎక్సైజ్ సిఐ మొబైల్ టీమ్‌తో సంయుక్తంగా ఇచ్ఛాపురం రైల్వేస్టేషన్ చుట్టు పక్కల గురువారం తనిఖీలు నిర్వహించారు. అనుమానాస్పదంగా తిరుగుతున్న ఇద్దరిని గమనించి వారిని లగేజ్‌లను సోదా చేశారు. వారి వద్ద నుంచి 22.566 కేజీల గంజాయి లభించింది. వారిద్దరూ ఒడిశా రాష్ట్రం మోహన బ్లాక్‌కు చెందిన తులుషా నాయక్, సామ్సన్ బీరోగా గుర్తించి కేసు నమోదు చేశారు. గంజాయిని, ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరినీ కోర్టులో హాజరుపరిచారు. దాడుల్లో సోంపేట ఎక్సైజ్ సిఐ జి.వి.రమణ, ఎస్ఐ సుజాత, సిబ్బంది శ్రీనివాస్, విజయ్, ఆనంద్ పాల్గొన్నారు.

భార్యాభర్తలకు తీవ్రగాయాలు

సంతబొమ్మాళి : మండలంలోని రెయ్యిపేట సమీపంలో సంభవించిన ద్విచక్ర వాహన ప్రమాదంలో భర్యాభర్తలకు తీవ్ర గాయాలయ్యాయి. ఉదయపురానికి చెందిన సంజీవ్, భార్య సరస్వతి బైక్‌పై సంతబొమ్మాళి నుంచి టెక్కలి వైపు వస్తున్నారు. రెయ్యిపేట మలుపు వద్ద వాహనం అదుపు తప్పి బోల్తాపడింది. ఈ ఘటనలో సంజీవ్ తలకు, తొడ భాగానికి తీవ్రగాయాలయ్యాయి. భార్యకు స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను స్థానికులు టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం శ్రీకాకుళానికి తరలించారు.

పోలీసుల తనిఖీ

ఇచ్ఛాపురం : ఇచ్ఛాపురం ముమ్మరంగా నార్కోటిక్ డాగ్‌తో తనిఖీలు నిర్వహించారు. పట్టణ ఎస్ఐ ముకుందరావు ఆధ్వర్యాన పోలీస్ సిబ్బందితో రైల్వే స్టేషన్, పట్టణ ముఖ్య ప్రాంతాల్లో షాపుల్లో నార్కోటిక్ డాగ్‌తో తనిఖీలు చేశారు. గుట్కా పాన్ పారాగ్, గంజాయి లాంటి మత్తు పదార్థాలపై తనిఖీలు నిర్వహించారు.

ఫేస్ యాప్ రద్దు చేయాలి

ప్రజాశక్తి- పలాస

అంగన్వాడీ వర్కర్లకు, హెల్పర్లకు, మినీ వర్కర్లకు, గర్భిణులు, బాలింతలు, పిల్లలకు ఫేస్ యాప్ రద్దు చేయాలని అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్ల యూనియన్ అధ్యక్షులు ఎం.మంజుల డిమాండ్ చేశారు. కాశీబుగ్గలో గురువారం యాప్, ఫేస్ యాప్‌లు రద్దు చేయాలని కోరుతూ ఈ నెల 21 చేపట్టనున్న సమ్మె నోటీసును ఐసిడిఎస్ పిఒ పార్వతికి గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోషణ ట్రాకర్ యాప్ బాల సంజీవిని తీసుకొచ్చి లబ్ధిదారులకీ ఆహారం ఒటిపి ద్వారా ఇకెవైసి చేసి ఫొటో క్యాప్చర్ చేస్తేనే సరుకులు ఇవ్వాలని పెట్టిన నిబంధనను తొలగించాలన్నారు. గతంలో వలె లబ్ధిదారులకు సంతకం పెట్టించుకొని సరుకులు ఇవ్వాలన్నారు. బియ్యం, పప్పు, ఆయిల్, గుడ్లు, కిట్లు సరుకులు ఒక్కసారి పంపించాలని కోరారు. వినతిపత్రం అందజేస్తున్న వారిలో బి.సునీత, కె.జ్యోతి, జి.సునీత, బి.సి.హిమావతి, ఎం.నిర్మల, బి.పద్మ, జి.సరస్వతి పాల్గొన్నారు.

ఆమదాలవలస: పట్టణంలోని సిడిపిఒ కార్యాలయం వద్ద ఈనెల 21న జరగనున్న అంగన్వాడీ కార్యకర్తల ధర్నాకు సంబంధించి గురువారం సమ్మె నోటీసును అందజేశారు. సిడిపిఒ నాగమణి అందుబాటులో లేకపోవడంతో జూనియర్ అసిస్టెంట్ అమర్నాథ్‌కు నోటీసును అందజేశారు. ఈ సందర్భంగా అంగన్వాడీ కార్యకర్తలు మాట్లాడుతూ చిన్నారుల హాజరు నమోదు చేసేందుకు ప్రభుత్వం అమలు చేస్తున్న 'ఫేస్ రికగ్నైజ్ యాప్' ను నిలిపి వేయాలన్న డిమాండ్‌తో ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 21న మధ్యాహ్నం 2 గంటలకు సిడిపిఒ కార్యాలయం వద్ద సెక్టార్ పరిధిలోని అంగన్వాడీ కార్యకర్తలంతా పెద్దఎత్తున హాజరై ధర్నా చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అంగన్వాడీలు కృష్ణవేణి, సునీత, స్వాతి తదితరులు పాల్గొన్నారు.

ఆమదాలవలస : వినతిపత్రం అందజేస్తున్న అంగన్వాడీలు

శిక్షణలు సమర్థవంతమైన బోధనకు దోహదం

జిల్లా విద్యాశాధికారి తిరుమల చైతన్య

ప్రజాశక్తి- పలాస

ప్రభుత్వ పాఠశాలలను మోడల్ పాఠశాలలుగా తీర్చిదిద్ది విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని డిఇఒ తిరుమల చైతన్య, సమగ్ర శిక్షా అభియాన్ ఎపిసి శశిభూషణ్ అన్నారు. కాశీబుగ్గ సూర్యతేజ జూనియర్ కళాశాల ఆవరణలో పలాస, టెక్కలి డివిజన్ పరిధిలో ఉన్న 12 మండలాల మోడల్, ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు పాఠశాల నాయకత్వ వత్తిపరమైన లక్షణాలపై నాలుగు రోజుల పాటు నిర్వహించిన శిక్షణా కార్యక్రమం గురువారంతో ముగిసింది. ఈ శిక్షణా తరగతులను వారు సదర్శించి అనంతరం మాట్లాడుతూ పాఠశాలలను సమర్థవంతంగా నడిపించడానికి విద్యాపరమైన లక్ష్యాలను సాధించడానికి అవసరమైన నైపుణ్యాలను నేర్పుతోందన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుకునేందుకు విద్యార్థుల శాతం పెరుగుతూ వస్తుందన్నారు. పాఠశాలలను కార్పొరేట్ పాఠశాలకు ధీటుగా తయారు చేసి, విద్యార్థులను ఉన్నత విద్యార్థులుగా తీర్చిదిద్దాలన్నారు. శిక్షణలో నేర్చుకున్న విషయాలు పాఠశాలలో అమలు చేసి పాఠశాల అభివృద్ధికి కృషి చేయాలన్నారు. ఎంఇఒలు సిహెచ్. శ్రీనివాసరావు, చెరుకుపల్లి సత్యం, సూర్యతేజ కళాశాల కరస్పాండెంట్ దానేటి పద్మజ, పోలాకి, సారవకోట కెజిబివి ప్రిన్సిపాల్ జె.శారద, అరుణ నాయుడు, ఎమ్మెస్ పల్లి, పాతపట్నం, సోంపేట మోడల్ స్కూళ్ల ప్రిన్సిపాళ్లు ఎన్. శివప్రసాద్, కె.రత్నకుమారి, చిన్నాజీవర్మ, రిసోర్స్‌పర్సన్లుగా వ్యవహరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డిఇఒ తిరుమల చైతన్య

రైతుల ఆందోళన

పొందూరు: తమ గ్రామానికి వస్తున్న యూరియా బస్తాలను టిడిపి నాయకులు ఒత్తిడితో వ్యవసాయ అధికారులు వేరేచోటకు దారి మళ్లించడంపై గురువారం మండలంలోని బాణాం మాజీ సర్పంచ్ పి.రవిబాబు ఆధ్వర్యంలో గ్రామ రైతులు ఆందోళన చేపట్టారు. లారీతో 430 యూరియా బస్తాలు గ్రామానికి వస్తుండగా గ్రామ సమీపంలో గల మూడు మర్రిచెట్లు వద్ద వాహనాన్ని నిలిపి అందులో 80 బస్తాలను కిందకు దించేశారు. ఈ విషయం తెలియడంతో గ్రామ రైతులు అక్కడికి చేరుకుని వాహనాన్ని కదలనీయకుండా కూర్చొని ఆందోళన చేపట్టారు. గ్రామానికి రావాల్సిన యూరియాను తీసుకురాకుండా మధ్యలో ఎందుకు దించారంటూ గ్రామ విఎఎ వెంకటేష్‌ను రైతులు నిలదీశారు. ఇప్పుడికే యూరియా లభించక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, దుకాణాల్లో అధిక ధరలకు కొనుగోలు చేయాల్సి వస్తుందని, అధికారులు, అధికార పార్టీ నాయకులకు తలొగ్గి ఈ విధంగా చేస్తే కలెక్టర్‌కు సంబందిత అధికారులపై ఫిర్యాదు చేస్తామంటూ మాజీ సర్పంచ్ రవిబాబు, రైతులు హెచ్చరించారు. రైతు సేవా కేంద్రాలకు వస్తున్న యూరియా బస్తాలను ప్రైవేటు వ్యాపారులకు అమ్ముకునేందుకే ఈ విధంగా టిడిపి నాయకులు చేస్తున్నారంటూ రైతులు ఆరోపించారు. ఈ విధంగా మండలంలోని పలు సచివాలయాల్లో అధిక సంఖ్యలో యూరియా బస్తాలను టిడిపి నాయకులు తరలించినట్లు పలు గ్రామాల రైతులు ఆరోపిస్తున్నారు. రైతులు ఆందోళన జరపడంతో తప్పనిసరి పరిస్థితిలో యూరియాను బాణాం రైతుసేవా కేంద్రానికి అధికారులు తరలించారు.

ఆందోళన చేస్తున్న మాజీ సర్పంచ్ రవిబాబు, రైతులు

పిఎసిఎస్ ఛైర్మన్ల బాధ్యతల స్వీకరణ

ఆమదాలవలస : మాధవిని సన్మానిస్తున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి- బూర్జ

మండల కేంద్రంలో పిఎసిఎస్ అధ్యక్షునిగా బగాది శ్రీరాములు నాయుడు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ పీరుకట్ల విశ్వప్రసాదరావు, మార్క్‌ఫెడ్ డైరెక్టర్ రామకృష్ణ, దేవాది శ్రీనివాసరావు, ఉట్టి లక్ష్మణరావు, టిడిపి మండల అధ్యక్షుడు సీతారాం బాబు నాయుడు, ఎఎంసి చైర్మన్ మజ్జి శ్రీరాములు నాయుడు, పీరుకట్ల సీతబాబు, వైస్ ఎంపిపి బుడుమూరు సూర్యారావు, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు తదితరులు పాల్గొన్నారు.

ఆమదాలవలస : పట్టణంలోని ఓ ప్రైవేట్ కల్యాణ మండపంలో కృష్ణాపురం పిఎసిఎస్ అధ్యక్షులు శిమ్మ మాధవి ప్రమాణ స్వీకారం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి కూన ప్రమీల, డైరెక్టర్లు బెండి దశరథ, మామిడి చిన్నారావు, నియోజకవర్గ జనసేన ఇన్‌ఛార్జి పేడాడ రామ్మోహనరావు, పేడాడ సూరపునాయుడు, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ తమ్మినేని గీత, మెట్ట సుజాత, కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ తమ్మినేని చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

నరసన్నపేట : నరసన్నపేట సొసైటీ ఆవరణంలో నరసన్నపేట ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం లిమిటెడ్ కార్యవర్గ ప్రమాణ స్వీకారం చేశారు. ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి ముఖ్యఅతిథిగా పాల్గొని నూతన కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు. సొసైటీ చైర్మన్‌గా ఇసా అప్పారావు, డైరెక్టర్లుగా సరిపల్లి మధు, బండి పాపారావు బాధ్యతలు స్వీకరించారు. కార్యక్రమంలో బిసి సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి ధర్మాన తేజ్‌కుమార్, మండల పార్టీ అధ్యక్షులు శిమ్మ చంద్రశేఖర్, ఎం.వెంకట అప్పలనాయుడు, మార్కెట్ కమిటీ చైర్మన్ పాగోటి ఉమామహేశ్వరి, సూరపు నారాయణదాసు, జామి వెంకట రావు, గొద్దు చిట్టిబాబు, సిఇఒ కె.ఈశ్వరరావు, పాల్గొన్నారు.

పోలాకి : పాథమిక వ్యవసాయ పరపతి సంఘం కార్యాలయంలో ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి సమక్షంలో అధ్యక్షులు భైరి భాస్కరరావుతో సిఇఒ రాంబాబు ప్రమాణా స్వీకారం చేశారు. అలాగే సభ్యులు పూజారి లచ్చన్న, తార, రామకృష్ణారావులతోనూ ప్రమాణ స్వీకారం చేశారు. డిసిసిబి సిఇఒ దత్తి సూర్యనారాయణ, డిజిఎం రమేష్, జిఎం సిమ్మ జగదీష్, బ్రాంచ్ మేనేజర్ సీతారాం, కళింగ కార్పొరేషన్ చైర్మన్ రోణంకి కృష్ణంనాయుడు, సర్పంచ్ పాల్గొన్నారు.

బూర్జ: ప్రమాణ స్వీకారం చేస్తున్న అధ్యక్షులు, సభ్యులు

వజ్రపుకొత్తూరు: రైతుల అభిమానం చూడగోనేలా కొత్త పాలకవర్గం సభ్యులు పనిచేయాలని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. వజ్రపుకొత్తూరు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం నూతన అధ్యక్షుడు కణితి సురేష్ చౌదరి, డైరెక్టలు రాపాక శాంతమూర్తి, కొత్తూరు అప్పారావుల ప్రమాణస్వీకార కార్యక్రమంలో మాజీమంత్రి గౌతు శివాజీతో కలిసి ఆమె పాల్గొన్నారు. కార్యక్రమంలో టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి పీరుకట్ల విఠల్‌రావు, టిడిపి మండల అధ్యక్షులు సురాడ మోహనరావు, పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు దువ్వాడ హేమబాబుచౌదరి, అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ పుచ్చ ఈశ్వరరావు, మాజీ ఎంపిపి వసంతస్వామి తదితరులు పాల్గొన్నారు.

వజ్రపుకొత్తూరు : సురేష్‌చౌదరిని సన్మానిస్తున్న శివాజీ

సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ మురళీ, సభ్యులు

పిఎసిఎస్ స్థలాలు ఆక్రమిస్తే చర్యలు

పొందూరు: స్థానిక పిఎసిఎస్ స్థలాలు ఆక్రమణకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని పిఎసిఎస్ చైర్మన్ వండాన మురళీ, సభ్యులు దుంపల సత్యం, కింజరాపు వెంకటరమణ హెచ్చరించారు. పిఎసిఎస్ కార్యాలయంలో గురువారం విలేకరులతో మాట్లాడారు. మండలంలోని కనిమెట్ట, పొందూరు, పిల్లలవలస, నందివాడ, లోలుగు, తండ్యాంలో పిఎసిఎస్‌కు సంబంధించిన ఆస్తులు ఉన్నాయని, వీటి ఆక్రమణకు పాల్పడే వారిపై పోలీసులకు ఫిర్యాదు చేసి కేసులు నమోదు చేయిస్తామన్నారు. అలాగే సొసైటీ పరిధిలో గల అర్హులైన రైతులందరికీ వ్యవసాయ రుణాలను మంజూరు చేస్తామన్నారు. రుణాల కోసం రైతులు తమ ఆధార్, పాస్‌బుక్, 1-బితో కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు. సమావేశంలో టిడిపి మండల అధ్యక్షుడు చిగిలిపల్లి రామ్మోహన్, నాయకులు అన్నెపు రాము, బలగ శంకర భాస్కరరావు, అప్పలనాయుడు, గంగాధర్ పాల్గొన్నారు.

నీటిని విడుదల చేస్తున్న చైర్మన్ ఢిల్లేశ్వరరావు తదితరులు

ఎడమ కాలువ సాగునీరు విడుదల

ప్రజాశక్తి- బూర్జ

మండలం తమ్మినేని పాపారావు నారాయణపురం అనకట్ట నుంచి ఎడమ కాలువలకు నీటి విడుదల గురువారం చేశారు. ఈ సందర్భంగా ప్రాజెక్ట్‌కమిటీ చైర్మన్ సనపల ఢిల్లేశ్వరరావు మాట్లాడుతూ ఈ ఏడాది శివారు ప్రాంత భూములకు కూడా సాగునీరు అందించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని, గడిచిన ఐదేళ్లలో ఏ ఏడాది కూడా ఎడమ కాలువ పనులు చేపట్టలేదని అందువలన గత ఐదేళ్లు పూర్తిగా రైతులకు నష్టం వాటిల్లిందన్నారు. ఈ ఏడాది ముందుగా జంగిల్ క్లియరెన్స్, మెంటినెన్స్ పనులు చేయడం జరిగిందని, శివారు ప్రాంతానికి సాగునీరు అందిస్తున్నామని ఆయన తెలిపారు. ఆయనతో పాటు ఉపాధ్యక్షులు కృష్ణారావు, నీటిపారుదల శాఖ శ్రీకాకుళం జిల్లా కార్యనిర్వాహక ఇంజనీర్ పొన్నాడ సుధాకరరావు, సహాయక ఇంజినీర్లు పుల్ల రామశివాజీ, కోత్తకోట రాంబాబు పాల్గొన్నారు.

ఎన్నికల ఆపరేటర్‌లకు జ్ఞాపికలు అందజేస్తున్న అధికారులు

ఇంటింటా సర్వే ద్వారా ఓటర్ల గుర్తింపు

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

ఇంటింటా సర్వే ద్వారా అర్హత గల ఓటర్లును గుర్తించి జాబితాలో చేర్చనున్నట్లు శ్రీకాకుళం తహశీల్దార్ ఎస్.గణపతిరావు అన్నారు. ఇండియా ఇంటర్నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ డెమోక్రసీ అండ్ ఎలక్షన్ మేనేజ్‌మెంట్ ఆదేశాల మేరకు ఆరవ రోజు గురువారం శ్రీకాకుళం నియోజకవర్గంలో వున్న పోలింగ్ కేంద్రం 251 నుంచి 279 వరకు బూత్ లెవెల్ ఆఫీసర్లకు, ఎన్నికల సూపర్ వైజర్లకు ఎన్నికల జాబితా నిర్వహణపై శిక్షణా కార్యక్రమం రెవెన్యూ గెస్ట్‌హౌస్‌లో సమావేశ మందిరంలో నిర్వహించారు. బూత్ లెవెల్ ఆఫీసర్లకు ఓటర్లు జాబితాపై, క్లెయిమ్స్‌పై, బిఎల్‌ఒ అప్లికేషన్, ఇసిఐ వెబ్‌సైట్‌పై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ప్రధానంగా 18 ఏళ్లు దాటిన వారిని ఓటర్లుగా చేర్పించటం, మృతి చెందిన వారిని జాబితా నుంచి తొలగించటం కీలకంగా వివరించారు. ఈ సందర్భంగా ఎన్నికల ఆపరేటర్‌లకు జ్ఞాపికలు అందజేశారు. ఈ శిక్షణలో డిటి జి.కె.శ్రీనివాసరావు, రాజశేఖర్ పాల్గొన్నారు.

దంత వైద్య శిబిరానికి స్పందన

ఇచ్ఛాపురం: జెసిఐ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యాన స్థానిక ప్రభుత్వ పాఠశాలలో గురువారం నిర్వహించిన ఉచిత దంత వైద్య శిబిరానికి స్పందన వచ్చింది. ఈ మేరకు 120 మంది విద్యార్థుల దంతాలను పరీక్షించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కె.సూర్యారావు, ఉపాధ్యాయులు ఎ.జయలక్ష్మి, తంగుడు శణ్ముఖ, శిరీష, రేణుక, శ్రావ్య, జెసిఐ అధ్యక్షులుకాళ్ల జయదేవ్, మోహన్, వెంకటేష్, పి.పవన్ పాల్గొన్నారు.

ఎన్‌సిసిని వినియోగించుకోవాలి

ప్రజాశక్తి- ఆమదాలవలస

ఎన్‌సిసిని విద్యార్థులు వినియోగించుకోవాలని ఎన్‌సిసి అధికారులు పి.మోహనరావు, బి.శరత్ కుమారి అన్నారు. గురువారం పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రార్థన సమావేశంలో ఎన్‌సిసి ప్రాధాన్యతను విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థిని, విద్యార్థులు ఎన్‌సిసి, క్రీడల ద్వారా ఉన్నత విద్యావకాశాలు, ప్రభుత్వ, ఇతర ఉద్యోగ అవకాశాలు పొందవచ్చునని సూచించారు. ఎన్‌సిసి బాలుర, బాలికల విభాగాల్లో చురుకుగా పాల్గొనడం ద్వారా భవిష్యత్‌కు బంగారు బాటలు వేసుకోవచ్చని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం కె.ఎ.రాములు, విద్యార్థులు పాల్గొన్నారు.

పి-4పై అవగాహన

నందిగాం : స్థానిక మండల పరిషత్ ఆవరణలో మండల ప్రత్యేక అధికారి, డిఎల్‌పిఒ ఐ.వి.రమణ బంగారు కుటుంబం రిజిస్ట్రేషన్‌పై కార్యక్రమంలో గురువారం అవగాహన కల్పించారు. మండల పరిషత్ అభివృద్ధి అధికారి కుమార్ పట్నాయక్, డిప్యూటీ ఎంపిడిఒ రాజారావు, తహశీల్దార్ పి.సోమేశ్వరరావు పాల్గొన్నారు.

మెళియాపుట్టి : తహశీల్దార్ కార్యాలయంలో పి-4 విఆర్‌ఒ లకు అవగాహన కల్పించారు. తహశీల్దార్ బడే పాపారావు, ఎంపిడిఒ నరసింహ ప్రసాద్ పండా, భారతి పాల్గొన్నారు.

నేడు వికలాంగుల ప్రత్యేక గ్రీవెన్స్

శ్రీకాకుళం సిటీ: నగరంలోని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో శుక్రవారం వికలాంగుల ప్రత్యేక గ్రీవెన్స్ సెల్ నిర్వహించనున్నట్లు దివ్యాంగ, వయోవృద్ధుల సంక్షమ శాఖ ఇన్‌ఛార్జి సహాయ సంచాలకులు బి.వి.శ్రీధర్‌రాజా ఒక ప్రకటనలో తెలిపారు. ఈ స్వాభిమాన్ ఫిర్యాదుల విభాగం సద్వినియోగం చేసు కోవాలన్నారు.

అహిర్‌ను కలిసిన బిసి సంఘ నాయకులు

ప్రజాశక్తి- రణస్థలం

ఎపి గెస్ట్‌హౌస్ విజయవాడలో జాతీయ ఒబిసి కమిషన్ చైర్మన్ హంసరాజ్ అహిర్, జాతీయ బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు లాకా వెంగళరావు యాదవ్, రాష్ట్ర ఇన్‌ఛార్జి ఆవుల నరసింహారావును గురువారం ఉత్తరాంధ్ర బిసి నాయకులు గొంప అప్పారావు, కాయితి వెంకటరమణ, ముద్దాడ రాజశేఖర్ యాదవ్, పానిల ప్రసాద్, వంజరాపు రాజు, జామి అనిల్ తదితరులు కలిశారు. రానున్న స్థానిక ఎన్నికల్లో బిసిలకు 50శాతం రిజర్వేషన్ కల్పించాలని జాతీయ బిసి సంక్షేమ సంఘం తరపున ఉత్తరాంధ్ర బిసి సంఘం నాయకులు కోరారు.

నారాయణపురం ఆనకట్ట పరిశీలన

బూర్జ: మండలంలోని తమ్మినేని పాపారావు నారాయణపురం ఆనకట్ట గెస్ట్‌హౌస్‌ను ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు గురువారం పరిశీలించారు. ఆనకట్ట ప్రస్తుత పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుడి, ఎడమ కాలువల ద్వారా సుమారు 30 వేల ఎకరాలకుపైగా సాగునీరు అందించి, ఈ ప్రాజెక్టు పునరుద్ధరించి పూర్వ వైభవాన్ని తీసుకొచ్చే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ ప్రాజెక్టు వలన ఏడు మండలాల రైతులకు అండగా నిలవాలన్నారు. కూటమి ప్రభుత్వం రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు తీసుకుంటుందని, ఇది రైతు ప్రభుత్వం అని స్పష్టం చేశారు. ఈయనతో ప్రాజెక్ట్ చైర్మన్ ఢిల్లేశ్వర రావు, రైతులు, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

ఎరువుల పంపిణీ

కోటబొమ్మాళి : మండలంలోని అక్కయ్యవలసలో పొలంపిలుస్తోంది కార్యక్రమం గురువారం వ్యవసాయ శాఖ అధికారులు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండల వ్యవసాయాధికారి ఎస్. గోవిందరావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైతులకు యూరియా, డిఎపిలను పంపిణీ చేశారు. రైతులకు వరి సాగులో కలుపు నివారణ అదితర అంశాల గురించి వివరించారు. కార్యక్రమంలో విఎఎ ఎస్.పద్మజ, రైతులు పాల్గొన్నారు.

పశువులకు టీకాలు

కోటబొమ్మాళి: మండలంలోని 12 వేలు లంపీ స్కిన్ వ్యాధి నివారణ టీకాలు ఉన్నాయని కురుడు పశువైద్యాధికారి లఖినేని కిరణ్‌కుమార్ అన్నారు. మండలంలోని రామయ్యపేట, బావాజీపేట, యరకయ్యపేట గ్రామాల్లో 319 పశువులకు ఉచితంగా టీకాలు వేశారు. పశువుల కళ్ల నుంచి నీరు రావడం, ముక్కు, నోటి ద్వారా చొంగలు రావడం, శరీరం అంతటా కణతలు, బొడిపెలు, రక్తం కారే పుండ్లు ఏర్పడి పక్క టెముకులు, కాళ్లు, వెన్నుముక, పొదుగు, కనురెప్పలు తదితర భాగాలకు వ్యాపిస్తాయని అన్నారు.

మోయలేని బ్యాగ్ భారం

- వయసుకు మించిన బరువులతో విద్యార్థుల అవస్థలు
- స్కూల్ బ్యాగులతో విద్యార్థుల్లో అనారోగ్య సమస్యలు

ప్రజాశక్తి- రణస్థలం

పాఠశాలకు వెళ్లే విద్యార్థుల బ్యాగులు ఎంతెంత బరువు ఉంటుందో మనం నిత్యం చూస్తుంటాం. రోజురోజుకూ బడి సంచి బరువెక్కుతోంది. ఆ సంచి మోయడమే కష్టమనుకుంటే ప్రైవేట్, కార్పోరేట్ పాఠశాలల్లో రెండు, మూడు అంతస్తుల మెట్లు ఎక్కాల్సి వస్తోంది. ఎల్‌కెజి, యుకెజి విద్యార్థులతో ఐదు కిలోల పైబడి బరువులున్న పుస్తకాలను మోయి స్తున్నారు. రాష్ట్ర సిలబస్‌కు తోడు ప్రైవేట్ పాఠశాలలు ప్రత్యేకంగా రూపొందించిన సిలబస్ ఐఐటి, జెఇఇ, సివిల్స్, వివిధ రకాల పుస్తకాలు ఆ బ్యాగులో ఉంటున్నాయి. జిల్లాలో లక్షల మంది విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలల్లో విద్యనభ్య సిస్తున్నారు.

నాడీ వ్యవస్థపై ప్రభావం

పిల్లల వయసుకు మించి బరువులు మోస్తే ఆనారోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉంది. ప్రధానంగా పిల్లల నాడీ వ్యవస్థపై ఆ ప్రభావం కనిపిస్తుంది. మెడ, నడుము, భూజాల నొప్పులు వస్తాయి. బ్యాగ్ ఒకవైపు వేసుకోవడంతో కండరాల నొప్పి, ఛాతిపై ఒత్తిడి పెరుగుతుంది. వెన్నెముక సమస్యతో పాటు ఎదుగుదల లోపం వస్తుంది. విద్యార్థులు ఎదుగుల వయసులో బరువులు మోస్తే ఇబ్బందులు ఎదుర్కోవాల్సి ఉంటుంది.

ఇడదాసుల యశ్వంత్, చిన్న పిల్లల వైద్య నిపుణులు, సూర్య ఆస్పత్రి, రణస్థలం

నో బ్యాగ్ డే అమలు చేస్తారా

విద్యార్థుల్లో ఆహ్లాదం నింపేందుకు, అనుభవపూర్వక పాఠాలు నేర్పేందుకు బ్యాగుల్లేని బడి నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వం గతేడాది జూలైలో మార్గదర్శకాలు జారీ చేసింది. 6 నుంచి 8 తరగతుల విద్యార్థులకు ఏడాదికి 10 రోజులు బ్యాగుల్లేని బడి నిర్వహించాలని నిర్ణయించినా అమలు చేయట్లేదు. అలాగే ప్రతి శనివారం నో బ్యాగ్‌డే అమలు చేయాలని ఫిబ్రవరిలో రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. అది అమలుకు నోచుకోకుండానే 2024 – 25 విద్యా సంవత్సరం ముగిసింది. ఈ 2025 – 26 ఏడాదైనా అమలు చేస్తే ఒక్కరోజైనా బడి సంచి మోత తగ్గుతుంది.

మోయలేని పుస్తకాల బ్యాగులతో విద్యార్థులు

తప్పుడు హామీలతో గద్దెనెక్కిన కూటమి ప్రభుత్వం

ప్రజాశక్తి- రణస్థలం

మండలంలోని వి.ఎన్.పురంలో మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. వైసిపి రణస్థలం మండల అధ్యక్షులు గొర్లె శ్రీనివాసరావు ముందుగా స్థానిక నాయకులతో సమావేశం నిర్వహించి బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ కార్యక్రమంపై గురువారం అవగాహన కల్పించారు. అనంతరం నేరుగా ప్రజల వద్దకు వెళ్లి క్యూ ఆర్ కోడ్‌ను స్కాన్ చేయించి చంద్రబాబు చేసిన మోసాలను ప్రజలకు వీడియో రూపంలో వివరించారు. ఆనంతరం మాట్లాడుతూ ప్రజలకు తప్పుడు హామీలు ఇచ్చి కూటమి ప్రభుత్వం గద్దెనెక్కిందన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చి 14 నెలలు గడిచినా ప్రజలను మోసం చేయడం తప్ప చేసేదేమీ లేదన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర యువజన విభాగం సంయుక్త కార్యదర్శి పిన్నింటి సత్యం నాయుడు, బిసి సెల్ అధ్యక్షులు మజ్జి రమేష్, యువజన విభాగం అధ్యక్షులు దన్నాన హరి, మాజీ సర్పంచ్ మింది జనార్ధన రెడ్డి, మండల ఎగ్జిక్యూటివ్ మెంబెర్స్ మహంతి అప్పల నాయుడు, టేకు బ్రహ్మాజీ, గొర్లె రాము నాయుడు, సర్పంచ్ బవిరి రమణ తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్‌ను అందజేస్తున్న వైసిపి నాయకులు

విస్తృతంగా 'తొలి అడుగు'

ప్రజాశక్తి- మెళియాపుట్టి

మండలంలోని జలకలింగపురం, మెళియాపుట్టి గ్రామాల్లో నిర్వహించిన తొలి అడుగు కార్యక్రమంలో మాజీ ఎంపిపి సలాన మోహనరావు, టిడిపి మండల మాజీ అధ్యక్షులు అనపాన రాజశేఖర్‌రెడ్డి, సర్పంచ్ రవ్వల అనురాధ, రవ్వల గణపతిరావు, సోషల్ మీడియా కన్వీనర్ ఒట్టు కోళ్ల చక్రి, ఎస్‌ఎంసి చైర్మన్ చినబాబు, శంకర్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏడాది కాలంలో అమలు చేసిన సంక్షేమం, అభివృద్ధిపై వివరించారు.

కోటబొమ్మాళి: మండల కేంద్రంలో 1,2 వార్డుల్లో స్థానిక టిడిపి నేతలు ఇంటింటికీ టిడిపి నిర్వహించారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి బోయిన గోవిందరాజులు, మాజీ సర్పంచ్ బోయిన శారదమ్మ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

ప్రజాశక్తి- రణస్థలం

రణస్థలం విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల నేపథ్యంలో శుక్రవారం పలు గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడునని ఇఇ పైడి యోగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. జె.ఆర్.పురం, రణస్థలం, రావాడ, కొండములగాం, కమ్మసిగడాం, వెల్పురాయి, దేవరాపల్లి, అర్జునవలస, ఎం.నగరప్పాలెం, బంటుపల్లి, తిరుపతిపాలెం, పున్నానపాలెం, సంచాం గ్రామాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు. అలాగే పైడిభీమవరం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పిసిని ఫీడర్ పరిధిలో కోష్ట, దేరసాం, చిల్లపేటరాజాం, పిషిణి, పతివాడపాలెం, వెంకటరావుపేట, వల్లభరావుపేట తదితర గ్రామాలకు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు.

రేపు...

ఆమదాలవలస : మండలంలోని తొగరాం సబ్ స్టేషన్ పరిధిలో ఉన్న జి.కె.వలస ఫీడర్‌లో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని ఎలక్ట్రికల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పైడి యోగేశ్వరరావు ప్రకటనలో తెలిపారు. కొత్తవలస, పాతూరు, నిమ్మతొర్లాడ, జి.కె.వలస, కొరపాం, చేపనపేట గ్రామాల్లో విద్యుత్ లైన్ల మార్చుట, ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు, నిర్వహణకు శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడునని తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలన్నారు.

ఆర్థికసాయం అందజేస్తున్న హారికాప్రసాద్

చదువుల తల్లికి అండ

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

హర్షవల్లి లయన్స్ క్లబ్ శ్రీకాకుళం వ్యవస్థాపకులు హారికాప్రసాద్ స్థానిక ఆర్ట్స్ కళాశాలలో ఇంటర్ ఎంపిసి రెండవ సంవత్సరం చదువుతున్న జోషిత ప్రియకు చదువు నిమిత్తం రూ.10 వేలు ఆర్థిక సాయం గురువారం అందజేశారు. పుస్తకాలు, అవసరమైన విద్యా సామగ్రిని అందజేశారు. పేద విద్యార్థులకు తమ సంస్థ అండగా ఉంటుందన్నారు. పేద విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరుకోవడం విద్యతేనే సాధ్యమన్నారు. కార్యక్రమంలో హర్షవల్లి లయన్స్ క్లబ్ అధ్యక్షులు డా. మేడిశెట్టి సత్యస్వరూప్, డా.కృష్ణ మోహన్, పూర్వపు జోన్ చైర్మన్ శోభారాణి ఉన్నారు.

ఆలయ నిర్మాణానికి దాతల సాయం

ప్రజాశక్తి- కవిటి

కవిటిలో దాతల సహాయంతో నూతనంగా నిర్మిస్తున్న కళ్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణ అభివృద్ధికి దాతలు అండగా నిలుస్తున్నారు. అందులో భాగంగా కవిటికి చెందిన మండల జగన్ 70 బస్తాలు, మొగిలిపురి భాగీరథి 50 బస్తాలు, కవిటి కొత్తూరుకు చెందిన పొందల భాస్కరరావు 20 బస్తాల సిమెంట్ విరాళంగా అందించారు. జగతికి చెందిన దిక్కుల బాబూరావు 1500 ఇటుకలు విరాళంగా అందించారు. కార్యక్రమంలో ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు బిపి రెడ్డి, మొగలిపురి సీతారాం, ఆరింగి మధు, పాండవ చంద్రశేఖర్, పొల్లాయి రుద్రయ్య పాల్గొన్నారు.

రేపు మండల ప్రజావేదిక

లావేరు : జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో భాగంగా మండలంలో 2024 – 25 ఆర్థిక సంవత్సరంలో రూ.30 కోట్లుతో చేపట్టిన పనులకు ఇటీవల చేపట్టిన సామాజిక తనిఖీల్లో జులై 19న మండల ప్రజావేదిక స్థానిక ఎంపిడిఒ కార్యాలయ ఆవరణలో ఉదయం 9 గంటలకు జరుగుతుందని ఎంపిడిఒ పి.వెంకటరాజు తెలిపారు. ప్రజావేదికకు సంబంధిత శాఖలకు చెందిన అధికారులు, ప్రజాప్రతినిధులు సకాలంలో హాజరు కావాలన్నారు.

అట్రాసిటీ కేసుల్లో స్టేషన్ బెయిల్ ఇవ్వకుండా చూడాలి

ఎస్‌సి కమిషన్ సభ్యుడిని కలిసిన జెఎసి నాయకులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం

ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసుల్లో పోలీసులు స్టేషన్ బెయిల్ ఇవ్వకుండా కోర్టు ద్వారానే ఆదేశాలు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని, ఆ మేరకు కేంద్ర న్యాయశాఖ మంత్రిత్వ శాఖతో మాట్లాడాలని జాతీయ ఎస్‌సి కమిషన్ సభ్యులు వడ్డేపల్లి రామచందర్‌ను దళిత సంఘాల జెఎసి నాయకులు డా.కంఠ వేణు, తైక్వాండో శ్రీను కోరారు. విశాఖకు విచ్చేసిన జాతీయ ఎస్‌సి కమిషన్ సభ్యులను వారు గురువారం కలిసి ఎస్‌సిలకు సంబంధించిన వివిధ విషయాలపై వారు వినతిపత్రాన్ని అందజేశారు. ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసుల్లో పోలీసులు స్టేషన్ బెయిల్ మంజూరు చేస్తున్నారని, ఇది సరికాదని కమిషన్ దృష్టికి వారు తీసుకువెళ్లారు. ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసుల్లో బెయిల్ ఇచ్చే అధికారం న్యాయస్థానాలకు మాత్రమే ఉందని, ఆ విధంగానే బెయిల్‌లు మంజూరు అయ్యేలా చూడాలని కోరారు. స్టేషన్ బెయిల్ ఇవ్వడం వలన చట్టం నీరుగారుతుందని తెలిపారు. జనాభా గణన పూర్తయిన తరువాత జిల్లాలు యూనిట్లుగా ఎస్‌సి వర్గీకరణ చేపట్టాలని కోరారు.

బంద్ విజయవంతం

ప్రజాశక్తి- పర్లాకిమిడి

గజపతి జిల్లా పర్లాకిమిడి, కాశీనగర్ పట్టణాలు, గ్రామీణ ప్రాంతాల్లో గురువారం నిర్వహించిన బంద్ విజయవంతమైంది. బాలేశ్వర్‌లోని పకీర్ మోహన్ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ సమీర్ సాహు లైంగిక వేధింపులు కారణంగా విద్యార్థినిపై ఆత్మహత్యకు పాల్పడింది. దీనికి నిరసనగా రాజకీయ పార్టీ నాయకులు, ప్రజా సంఘాల నాయకులు పిలుపు మేరకు బంద్ నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు, సిరిలి సర్పంచ్ రాంప్రసాద్ పట్నాయక్ మాట్లాడుతూ విద్యాలయం ప్రిన్సిపాల్‌కు, పోలీసులకు రాత పూర్వకంగా, ఎక్స్ ఖాతాలో ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని అన్నారు. రాష్ట్రంలో అవినీతి తప్ప అభివృద్ధి ఏమీ లేదని ఆరోపించారు. ఎఐకెఎంఎస్ జిల్లా కార్యదర్శి కేదార్ సబర్ మాట్లాడుతూ బిజెపి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఆదివాసీలపై, దళితులపై, మహిళలపై దాడులు పెరిగాపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో గజపతి జిల్లా రైతు కూలీ, రైతు సంఘం ప్రధాన కార్యదర్శి రొక్కం లోకనాథం తదితరులు పాల్గొన్నారు.

బంద్ నిర్వహిస్తున్న నాయకులు

అవగాహన కల్పిస్తున్న చిట్టిబాబు

పామాయిల్ పెంపకంపై అవగాహన

ప్రజాశక్తి- సోంపేట

మండలంలోని పలాసపురం వద్ద దువ్వి కృష్ణారెడ్డి పొలంలో గురువారం ఉద్యానవనశాఖ అధికారులు రైతులకు పామాయిల్ మొక్కల పెంపకంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఉద్యానవనశాఖ సహాయ సంచాలకులు చిట్టిబాబు ఆయిల్ ఫామ్ సాగు వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. ఆయిల్ ఫామ్ సాగు చేసే రైతులకు ఉచితంగా మొక్కలు అందిస్తామనానరు. ఏటా వాటి నిర్వహణకు ప్రభుత్వం రూ.8,400 అందజేస్తుందని తెలిపారు. అంతర పంటల ప్రోత్సాహానికి ఏడాదికి మరో రూ.8,400 ఎకరాకు అందిస్తారని తెలిపారు. ఈ అవకాశాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో అధికారులు బాలరాజు, వీరబాబు, సిబ్బంది సౌమ్య, షణ్ముఖ, రైతులు పాల్గొన్నారు.

అంధకారంలో కొత్త వీధి

ప్రజాశక్తి- ఆమదాలవలస

పురపాలక సంఘంలోని 18వ వార్డు కొత్తవీధిలో గడచిన రెండు రోజులుగా వీధి దీపాలు వెలగకపోవడంతో స్థానికులు తీవ్రమైన అసౌకర్యాన్ని ఎదుర్కొంటున్నారు. రాత్రిపూట వెలుతురు లేక అంధకారంగా మారిన వీధుల్లో ప్రయాణించే వాహనదారులు, పాదచారులు ప్రమాదానికి గురవుతున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయాన్ని గుర్తించిన అదే ప్రాంతానికి చెందిన మాజీ ఎజిపి బూర్లె సీతారాం స్పందిస్తూ సిబ్బందికి పలుమార్లు తెలిపినప్పటికీ సమస్య పరిష్కారం కాలేదన్నారు. ప్రజల భద్రత దృష్ట్యా సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి వీధి దీపాల మరమ్మతులు చేయించాలని కోరారు. రాత్రి సమయంలో పిల్లలు, వృద్ధులు బయటికి వెళ్లలేని పరిస్థితి ఏర్పడుతుందని సీతారాం అన్నారు. ప్రజలు మౌలిక సదుపాయాల కోసం ఎదురుచూస్తూ ఉండటం తగదన్నారు. అధికారులు, సంబంధిత సిబ్బంది సమస్యలను గుర్తించి పరిష్కారం చేయాలన్నారు.

వీధి దీపాలు లేక అంధకారంగా ఉన్న కొత్త వీధి

మెమోంటో అందజేస్తున్న నాగేశ్వరరావు

విద్యార్థి దశ కీలకం

టెక్కలి రూరల్ : టెక్కలి ఆదిత్య కళాశాలలో ఇంజినీరింగ్ చదువుకుని అమెరికాలో సాఫ్ట్‌వేర్‌గా సమీర్ భవాని భట్ల స్థిరపడ్డాడు. ఐతమ్ కళాశాల పూర్వ విద్యార్థి సంఘ అధ్యక్షునిగా ఇటీవల ఎంపికయ్యారు. ఈ మేరకు గురువారం తమ చదువుకున్న కళాశాలకు సతీసమేతంగా వచ్చారు. ఇంజినీరింగ్ చదువుతున్న విద్యార్థులతో సమావేశం నిర్వహించి తమ అనుభవాలను పంచుకున్నారు. ఆ సందర్భంగా మాట్లాడుతూ సాంకేతిక రంగ అభివృద్ధిలో విద్యార్థులు ఎప్పటికప్పుడు నూతన ప్రణాళికను ఏర్పర్చుకోవాలన్నారు. అనంతరం మెమోంటోలను అందజేశారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి.నాగేశ్వరరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, అసోసియేట్ డీన్ అల్యూమిన్ రిలేషన్ డాక్టర్ డి.యుగంధర్, డాక్టర్ కె.వి.ఎల్.భవాని పాల్గొన్నారు.

వేధింపుల నుంచి రక్షణ కల్పించాలి

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

టెక్కలి ఆర్‌డిఒ ఎం.కృష్ణమూర్తి, మరికొందరు వ్యక్తులు దళితుడునైన తనను అన్ని విధాలుగా అవమానిస్తూ వేధింపులకు గురిచేస్తున్నారని దళిత సంఘ నాయకులు, సినీ నిర్మాత బలగ ప్రకాష్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు జాతీయ ఎస్‌సి కమిషన్ సభ్యులు వడ్డేపల్లి రామందర్ గురువారం విశాఖ పర్యటనలో భాగంగా ఆయనను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా తక్షణం విచారణ చేపట్టి బాధ్యులపై ఎస్‌సి అట్రాసిటీస్ చట్టం కింద చర్యలు తీసుకోని న్యాయం చేయాలని కోరారు. మండలంలోని రఘునాథపురంలో సర్వే నంబర్లు 520/1,520/3ల్లోని 34 సెంట్లు, ఎ 1.66 సెంట్ల స్థలాన్ని రిజిస్టర్డ్ డీడ్ ద్వారా కొనుగోలు చేశానని తెలిపారు. తహశీల్దార్ ఆ స్థలాన్ని తన పేరున మ్యుటేషన్ కూడా చేశారని తెలిపారు. టెక్కలికి చెందిన లక్కోజి గంగారావు, లక్కోజి శంకరరావు, లక్కోజి కేశవరావు, తదితరులతో పాటు కొందరు ప్రభుత్వ అధికారులు అన్ని విధాలుగా తనను వేధిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న ప్రకాష్

సురేష్‌ను సన్మానిస్తున్న టిడిపి నాయకులు

మండల అధ్యక్షునికి అభినందనలు

లావేరు : టిడిపి లావేరు మండల అధ్యక్షునిగా 9వసారి ఎన్నికైన ముప్పిడి సురేష్‌ను లావేరు, గురుగుబిల్లి, అప్పాపురం, బుడుమూరు, లక్ష్మీపురం తదితర పంచాయతీలకు చెందిన నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు గురువారం శుభాకాంక్షలు తెలుపుతూ సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి నిరంతరం శ్రమించే వ్యక్తి సురేష్ అని, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ఘనవిజయం సాధిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎఎంసి చైర్మన్ యినపకుర్తి తోటయ్యదొర, మాజీ జెడ్‌పిటిసి నిడిగంటల త్రినాథ్, మాజీ సర్పంచ్‌లు మాకన శంకరరావు, గండి పార్వతి, నాయకులు లంకలపల్లి శ్రీనువాసరావు, లావేరు ఎస్‌ఎంసి చైర్మన్ లంకలపల్లి రాంబాబు, ఎల్.ఆనందరావు, వెంకటరమన, గండి సురేష్, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

పరామర్శిస్తున్న కిరణ్ కుమార్

మాజీ ఎమ్మెల్యే పరామర్శ

రణస్థలం: మండలంలోని పాతసుందరపాలెం గ్రామానికి చెందిన వెలుగు విఒఎ కోరెడ్ల జయలక్ష్మి ప్రమాదంలో గాయపడిన నేపథ్యంలో కాలుకు శస్త్ర చేసుకున్న కారణంగా ఆమెను ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ గురువారం పరామర్శించారు. అలాగే మండలంలోని కోటపాలెం గ్రామానికి చెందిన ఎర్రబోలు మంగరాజు మాతృమూర్తి ఇటీవల మరణించిన కారణంగా ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆనంతరం వారి కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు. ఈ పరామర్శలో వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని కాపాడాలి

టెక్కలి : పర్యావరణ పరిరక్షణ ప్రతిఒక్కరి బాధ్యత అని, విద్యార్థి దశ నుంచే వాటిని అలవర్చుకోవాలని బూరగాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు పూజారి హరిప్రసన్న అన్నారు. ఈ మేరకు విద్యార్థులతో కలిసి పాఠశాల ఆవరణలో గురువారం మొక్కలను నాటారు. అమ్మ పేరుతో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టిందన్న విషయం తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కుప్పిలి నగేష్, ఖగేశ్వరరావు, ఆలివేణి, లోకనాథం పాల్గొన్నారు.

ఎస్‌విఆర్ కళాశాల విద్యార్థుల ప్రతిభ

టెక్కలి రూరల్ : ఇటీవల చెన్నైలో నిర్వహించిన బాల్ బ్యాట్మెంటన్ పోటీల్లో ఎస్‌విఆర్ కళాశాల విద్యార్థులకు నాలుగో స్థానం విజయం సాధించారని కరస్పాండెంట్ అన్నిపి ఉమామహేశ్వరరావు తెలిపారు. విద్యార్థులు ఎస్.కిరణ్‌కుమార్, పి.నవదీప్, పి.బవానిశంఖర్, యు.ప్రభ, వి.యెగిలను గురువారం అభినందించారు.

హామీలపై ప్రశ్నిస్తే దాడులా?

మాజీ మంత్రి అప్పలరాజు

ప్రజాశక్తి- పలాస

కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత హామీలపై ప్రశ్నిస్తే ఎదురుదాడులకు దిగుతున్నారని, ఇంతటి దిగజారుడు రాజకీయం సరికాదని మాజీ మంత్రి డాక్టర్ సిదిరి అప్పలరాజు అన్నారు. మండలంలోని వైసిపి విస్తృతస్థాయి సమావేశం కాశీబుగ్గ కీర్తన ఫంక్షన్ హాల్‌లో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర కాలం గడిచినా ఏ ఒక్క హామీ పూర్తిస్థాయిలో అమలు చేయలేదని అన్నారు. వైసిపి మండల అధ్యక్షులు దువ్వాడ రవికుమార్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో హనుమంతు వెంకట్రావు దొర, ఉంగ సాయికృష్ణ, పైల చిట్టిబాబు, బత్తిన హేమేశ్వరరావు, బమ్మిడి దుర్యోధన పాల్గొన్నారు.

కూటమి వైఫల్యాలను ఎండగట్టాలి

కొత్తూరు: కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ అమలు చేయడంలో, అభివృద్ధిలో వైఫల్యం చెందిందని మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి ఆరోపించారు. స్థానిక బోర శ్రీరాములు నాయుడు కళ్యాణ మండలంలోని వైసిపి మండల విస్తృత సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజలను మోసాలు చేసి అదికారంలోకి వచ్చిందన్నారు. ఏడాది దాటినా సూపర్ సిక్స్ అమలు చేయలేదన్నారు. రైతులకు అన్నదాత సుఖీభవ, మహిళలకు రూ.1500, వసతి దీవెన, విద్యా దీవెన ఇంతవరకు అమలు చేయలేదన్నారు. కార్యక్రమంలో ఎంపిపి సవర సావిత్రి, జెడ్‌పిటిసి కామక భాగ్యమతి, వైసిపి మండల కన్వీనర్ గండివలస ఆనందరావు, పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు చింతాడ సూర్యనారాయణ పాల్గొన్నారు.

పలాస : మాట్లాడుతున్న మాజీ మంత్రి అప్పలరాజు